నిజామాబాద్, బుధవారం 14 మే 2025
WEDNESDAY 14 MAY 2025

## చెత్తను తొలగించరూ..



కుభీర్ : బీసీ కాలనీలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తింటున్న పశువులు

కుభీర్, మే 13 : గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్మల్ జిల్లా కుభీర్‌లోని గణేశ్ నగర్ కాలనీలో చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి కాలనీ వాసులకు దుర్వాసన వెదజల్లుతున్నది. వీటిని పశువులు తింటూ అనారోగ్యానికి గురవుతున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి ఈ కాలనీలోని చెత్తను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, మే 13: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని మందబోగడ గ్రామానికి చెందిన పెంట లక్ష్మీకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.26వేలు మంజూరయ్యాయి. మంగళవారం క్యాంపు కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

భైంసా, మే 13 : నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ పంపిణీ చేశారు. మొత్తం 48 మంది లబ్ధిదారులకు రూ.15 లక్షల 50 వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు , ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన

ఇచ్చోడ, మే 13: ఆదిలాబాద్ జిల్లా సిరికొండలోని రైతు వేదికలో ఏఈవో ప్రవీణ్, లక్కంపూర్ గ్రామంలో ఏఈవో దీపక్ వానకాలంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్ల నుండి తీసుకున్న విత్తనాలకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వివిధ పంటల సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోళ్లు నిలిపివేత

ఇంద్రవెల్లి, మే 13: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని జొన్నల కొనుగోలు కేంద్రంలో జొన్నల నిల్వలు ఎక్కువగా ఉన్నందున, వాతావరణంలో మార్పుల కారణంగా జొన్నల కొనుగోలు కేంద్రం రెండు రోజులు నిలిపివేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్, సీఈవో ధరంసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు షెడ్యూల్ తయారు చేసి కొనుగోలు తేదీలను తెలియజేస్తామని, తర్వాత రైతులు తమ జొన్నలను మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

బోథ్, మే 13: ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలంతో పాటు రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు పాటిల్ అమృత్ రావ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా సొనాల ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, అసలైనా పేదలు, ఉద్యమకారులకు ఇందిరమ్మ ఇండ్లలో లబ్ధి చేకూరడం లేదన్నారు. ఇప్పటికైనా సరైనా సర్వే నిర్వహించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షేక్ మహిమూద్, సామాజిక కార్యకర్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బీసీ మేలుకొలుపు యాత్రను జయప్రదం చేయండి

కుభీర్, మే 13 : బీసీ ఆజాద్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను జాగృతం చేసే దిశగా 'మేమెంతో మాకంతా' నినాదంతో సాగుతున్న మేలుకొలుపు యాత్రను జయప్రదం చేయాలని బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు సుంకెట పోశెట్టి కోరారు. మంగళవారం నిర్మల్ జిల్లా కుభీర్‌లో ఆయా పార్టీలకు చెందిన బీసీ నాయకులను కలిసి యాత్రకు బీసీలంతా ఐక్యంగా మద్దతు తెలుపాలని కోరారు. ప్రతి పల్లెలో బీసీ జెండాను ఎగురవేసేందుకు గాను సమాయత్తం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన నేపథ్యంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ వచ్చే స్థానిక సంస్థల్లో తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం కూడా కులగణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో ఆలస్యం చేయకుండా వెంటనే చేపట్టాలన్నారు. స్థానిక బీసీ నాయకులు పాల్గొన్నారు.

## రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

పెంబి, మే 13: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పథకంలో భాగంగా అగ్రిస్టాక్ పేరుతో రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తుందని ఏఈవో రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా పెంబిలోని రైతులకు అవగాహన కల్పించారు. రెవెన్యూ పట్టా పాస్‌బుక్ కలిగిన ప్రతి రైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీని కోసం తప్పనిసరిగా ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## సమ్మెలో బహుజనులు పాల్గొనాలి

దస్తురాబాద్, మే 13 : ఈ నెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో బహుజనులు పాల్గొనాలని బీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు పస్పుల వెంకన్న కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అన్నారు. కనీస వేతనం రూ 30 వేలు అమలు చేయాలి. బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. భవన, ఇతర నిర్మాణ కార్మికులు విధి నిర్వహణలో మృతి చెందితే రూ. 50 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని పేర్కొన్నారు.

## నవదుర్గమాత శక్తిపీఠం ఏర్పడడం మన అదృష్టం

ఎదులాపురం, మే 13: నవ దుర్గా మాత వెలసిన రోజున ప్రతిష్ఠించుకుంటూ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. మంగళవారం దుర్గా నగర్‌లోని దుర్గా మాత ఆలయంలో నవశక్తి పీఠాన్ని ఊరేగిస్తూ అమ్మవారి కొలువుదీరిన సందర్భంగా భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇలాంటి శక్తి పీఠ అభివృద్ధికి మరింతగా పాటుపడాలని సూచించారు.

## డిప్లమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, మే 13 : హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశముఖ్ ప్రభుత్వ మహిళ టెక్నికల్ శిక్షణ సంస్థలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కే మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన (అనాథలు), తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలికలు మాత్రమే దరఖాస్తులకు అర్హులని పేర్కొన్నారు. కులం, ఆదాయం (అనాథ బాలికలకు అవసరం లేదు), మరణ ధృవీకరణ పత్రం, బోనాఫైడ్ పత్రాలు దరఖాస్తుకు జతచేసి జిల్లా కేంద్రంలోని బాలరక్షా భవన్‌లో ఈ నెల 18వ తేదీ లోపు అందించాలన్నారు. వివరాలకు 9493433400, 9966490203 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# ధాన్యం కొనుగోళ్లకు మోక్షం ఎప్పుడో?



గంగన్నపేట్ కొనుగోలు కేంద్రంలో వడ్లను ఆరబెడుతున్న రైతులు

- ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఉట్నూర్ రూరల్, మే 13 : వరి కోతలు ప్రారంభమై 15 రోజులు కావొస్తున్న ఉట్నూర్‌తో పాటు మండలంలోని గంగన్నపేట్ గ్రామంలో కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో కొందరు రైతులు వరి కోత అనంతరం చేనులోనే వడ్ల కుప్పలు పోసుకున్నారు. మరి కొందరు కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకువచ్చారు. వారం రోజుల నుంచి కేంద్రంలో రాత్రి, పగలు పడిగాపులు కాస్తున్న ఐకేపీ, రెవెన్యూ, వ్యవసాయ అధికారి తిరిగి చూడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం పండించిన పంటను కాపాడుకోవడం ఒక ఎత్తయితే..చేతికొచ్చిన పంటను అమ్ముకోవడం తలకు మించిన భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వల్ల మరల ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఇప్పటికైన అధికారులు స్పందించి త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## ప్రమాదకరంగా వ్యవసాయ బావులు

దస్తురాబాద్, మే 11 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని పెర్కపల్లె, చెన్నూర్ గ్రామాల సమీపంలో ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావులు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. దగ్గరికి వచ్చే వరకు అక్కడ బావులు కనిపించడం లేదు. కొత్త వారు వస్తే ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ గోడలను ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్లు, వాహనదారులు కోరుతున్నారు.



చెన్నూర్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి

## గ్రామస్తుల సమస్యలు కలెక్టర్‌కు వివరిస్తా



మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి అజీజ్‌ఖాన్

దిలావర్‌పూర్, మే 13: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ గ్రామస్తులు గ్రామంలో ఉన్న ఊర పందులతో పడుతున్న ఇబ్బందుల గురించి సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మల్ డివిజనల్ పంచాయతీ అధికారి అజీజ్‌ఖాన్, గ్రామస్తులు, ఎరుకల కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు గ్రామంలో పందులతో కలుగుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. ఎరుకల కులస్థులకు పందుల పెంపకం కోసం స్థలం కేటాయించాలని వారు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు వివరించిన సమస్యలు, పడుతున్న ఇబ్బందులను గురించి, ఎరుకల కులస్థుల ఇబ్బందుల, వాటి వలన కులుగుతున్న ప్రజల బాధలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎరుకల కులస్థులు తమకు ప్రభుత్వం నుంచి భూమి కేటాయించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 13 : జిల్లాలోని ఇంటర్మీడియట్ రెసిడెన్షియల్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ ప్రదానం చేశారు. వివిధ మేనేజ్‌మెంట్లలో మహాత్మా జ్యోతిబాపూలే, సాంఘిక సంక్షేమ గిరిజన, సంక్షేమ మైనార్టీ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీలో జిల్లా స్థాయిలో నిలిచిన 11 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీజీ జిల్లా టాపర్ ఎంపీసీ 992 నిలిచిన ఆడె వాసవికి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో డీఐవో శ్రీనివాస్, డీఐఈవో గణేశ్, ఎస్సీ గురుకులం డీసీవో లలితాకుమారి, అధికారులు పాల్గొన్నారు.

### భూ భారతి సదస్సు పరిశీలన

జైనథ్, మే 13 : ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని డొల్లారా గ్రామంలో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా వచ్చిన 17 దరఖాస్తులను కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి పరిశీలించారు. దరఖాస్తుదారులతో కలెక్టర్ మాట్లాడారు. సమస్యల తీరుపై అడిగి తెలుసుకొని, పరిశీలించి రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## బోధనా సామర్థ్యాలు పెంచేలా శిక్షణను వినియోగించుకోవాలి

ఎదులాపురం, మే 13 : బోధనా సామర్థ్యాలు పెంచేలా అందిస్తున్న శిక్షణను వినియోగించుకుంటూ పాఠశాలల్లో ప్రతి ఉపాధ్యాయుడు అమలు చేయాలని డీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పీజీహెచ్ఎం, హెచ్ఎం, ఎస్ఏ, స్పెషల్ ఎడ్యుకేటర్స్, ఆల్ ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు మంగళవారం ఆదిలాబాద్‌లోని డైట్‌లో నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న వాటిని తరగతి గదిలో అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలన్నారు. వంద శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 2600 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొంటారని, అదే విధంగా మండల స్థాయిలో కూడా శిక్షణలు ఇవ్వడానికి ఆర్పీలు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, సెంటర్ ఇన్‌చార్జి సుజాత్ ఖాన్ పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది కలగకుండా చూడండి

జైనథ్, మే 13: జొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదేశించారు. మంగళవారం సాత్నాల మండలంలోని మేడిగూడ(ఆర్)లో చేపడుతున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట మేడిగూడ సొసైటీ సీఈవో శాలిక్ రావ్, నాయకులు, రైతులు ఉన్నారు.

## రెండు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న డీఈ హరికృష్ణ

తాంసి(భీంపూర్), మే 13: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌తో పాటు పిప్పల్‌కోటి గ్రామంలో ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం విద్యుత్ శాఖ డీఈ హరికృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ తిరుపతిరెడ్డి, సబ్ ఇంజినీర్ వినయ్, లైన్ ఇన్‌స్పెక్టర్ సోఖత్, లైన్‌మెన్లు రవీందర్, రాజశేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

## సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలి



ఎదులాపురం: పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎదులాపురం, మే 13 : దేశ సంపదను, హక్కులను కాపాడుకోవడం కోసం సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సమ్మె పోస్టర్, బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలు ప్రతిఘటించేందుకు కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన సార్వత్రిక సమ్మెను గ్రామీణ బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నేళ్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు పండుగ పొచ్చన్న, జనార్దన్, నాయకులు రమేశ్, గంగారాం కుమార్, అరవింద్, అరుణ్, మహేందర్ పాల్గొన్నారు.

నిర్మల్ చైన్‌గేట్, మే 13 : ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి జే రాజు పిలుపునిచ్చారు. దేశ వ్యాప్త రైతాంగం, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలనే డిమాండ్‌తో చేపడుతున్న సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని రైతులు, కార్మికులు పాల్గొనాలని కోరారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బోథ్, మే 13: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని నక్కల్‌వాడకు చెందిన మెస్రం వెంకటేశ్వర్(31)కు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం భార్య మృతి చెందింది. అప్పటి నుంచి వెంకటేశ్వర్ ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ ఒంటరితనంతో బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. మృతుడి పెద్ద అన్న మెస్రం దత్తురాం వెళ్లి చూడగా వెంకటేశ్వర్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి మెస్రం సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

## 136 క్వింటాళ్ల జొన్నల వాహనం సీజ్

తాంసి, మే 13 : ఆదిలాబాద్ జిల్లా తాంసిలోని సబ్ మార్కెట్ యార్డ్‌లో అక్రమ జొన్నలను అధికారులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు 136 క్వింటాళ్ల జొన్నలను గత ఏడాదికి చెందిన వాటిని గుర్తించిన స్థానిక రైతులు మంగళవారం సెంటర్ ఇన్‌చార్జి కేశవ్, మండల వ్యవసాయ అధికారి రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేపట్టారు. ఆ జొన్నల విషయంలో రైతులు ఎవరు ముందుకు రాకపోవడంతో 272 జొన్న సంచులను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. కాగా ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం వెళ్లినట్లు సమాచారం. 136 క్వింటాళ్ల పాత జొన్నలు పట్టుబడడంతో మరో మ్యాక్స్ వాహనంలో వచ్చిన జొన్నలను మార్కెట్లో దించకుండా తిరిగి వెళ్లినట్లు స్థానిక రైతులు తెలిపారు.

## ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి

నార్నూర్, మే 13 : నార్నూర్ మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు రద్దు చేసి ఆదివాసులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం నాయకులు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జవహర్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పూసం ఇస్రూ, ప్రధాన కార్యదర్శి ఆర్కా గోవింద్‌రావ్, నాయకులు కినక ప్రభాకర్ ఉన్నారు.

# గంజాయి సాగు కలకలం

- పంట చాటున రహస్యంగా సాగు
- రూ. 1.60 లక్షల గంజాయి మొక్కలు స్వాధీనం



పెంబి: గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుంటున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

పెంబి, మే 13 : నిర్మల్ జిల్లా పెంబి మండల పరిధిలోని చిన్న గోధుమాల, పోచంపల్లి గ్రామాల్లో పంట పొలాల మధ్య రహస్యంగా సాగు చేస్తున్న గంజాయిని పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నిర్మల్‌లో ఏఎస్పీ రాజేశ్ మీనా దీనికి సంబంధించిన వివరాలు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పెంబి మండలంలో గంజాయి సాగు చేస్తున్నారన్న సమాచారం మేరకు ఖానాపూర్ సీఐ అజయ్, పెంబి ఎస్ఐ హన్మాండ్లు సిబ్బందితో కలిసి చిన్న గోదుమాల గ్రామంలో అదే గ్రామానికి చెందిన కుమ్రం దొండురావ్ తన వ్యవసాయ భూమిలో కూరగాయల పంట చాటున సాగు చేస్తున్న రూ.1.40 లక్షల విలువ గల 14 గంజాయి మొక్కలు, అలాగే పోచంపల్లి గ్రామంలో అదే గ్రామానికి చెందిన మెఘవాత్ కైలాస్ తన పంట పొలంలో రూ. 20 వేలు విలువ గల 2 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా సాగుకు పాల్పడిన దొండురావ్, కైలాస్‌ను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ అజయ్, పెంబి ఎస్ఐ హన్మాండు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నిర్మల్ అర్బన్, మే 13 : నిర్మల్ బస్టాండ్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని నిర్మల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిర్మల్ పట్టణం చిక్కడపల్లికి చెందిన షేక్ నిజాముద్దీన్(28) 200 గ్రాముల గంజాయితో పట్టుబడ్డాడు. ఈ మేరకు అతని వద్ద ఉన్న గంజాయిని, సెల్‌ఫోన్లు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ నుంచి గంజాయిని తీసుకువచ్చి నిర్మల్‌లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు.

### ఇద్దరి అరెస్ట్

భైంసా, మే 13 : నిర్మల్ జిల్లా భైంసాలో అక్రమంగా గంజాయిని అమ్ముతున్న ఇద్దరిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ అవినాశ్ కుమార్ తెలిపారు. భైంసాలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముజాయిత్ ఖాన్, షేక్ హైమద్ గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులతో తనిఖీలు నిర్వహించగా పట్టణంలోని ఖడ్డా హోటల్ వద్ద వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 1.5 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. వీరిని పట్టుకోవడానికి సమాచారం సేకరించిన పట్టణ సీఐ గోపీనాథ్, ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది ప్రమోద్, క్రాంతి, శరత్, హరిబాబు, బాలాజీలను ఎస్పీ జానకీ షర్మిల అభినందించినట్లు ఆయన తెలిపారు.



నిర్మల్‌అర్బన్: నిందితుడిని అరెస్టు చేసి చూపుతున్న పోలీసులు



భైంసా : మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

## బాధిత కుటుంబాలకు పరామర్శ



ప్రణీత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జోగు రామన్న

జైనథ్, మే 13: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కంట గ్రామానికి చెందిన ప్రణీత రోడ్డు ప్రమాదంలో, బాలాపూర్‌లో రౌతు ప్రవీణ్ గుండెపోటుతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు యాసం నర్సింగరావ్, మెట్టు ప్రహ్లాద్, మాజీ సర్పంచ్ వినోద్ యాదవ్, దీపక్, మహేందర్ ఉన్నారు.

## బోరిగాంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



బోరిగాంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ముథోల్, మే, 13 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో సోమవారం జరిగిన ఘటన నేపథ్యంలో ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు ముథోల్ సీఐ మల్లేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 100 మంది పోలీసులతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గ్రామంలో ఆయా వీధుల గుండా పోలీసులు ర్యాలీ తీశారు. ప్రజలకు శాంతి భద్రతల పరిరక్షణకు తాము ఉన్నామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ముథోల్ ఎస్ఐ సంజీవ్, పోలీసు బలగాలు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర రైతులకు విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసులు

బేల, మే 13 : మండలంలోని సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాప్ యజమానులు మహారాష్ట్ర రైతులకు విత్తనాలు అమ్మితే షాప్ యజమానులపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని బేల తహసీల్దార్ రఘునాథ్ రావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి, బేల పోలీసుల ఆధ్వర్యంలో యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సాయి తేజారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వామన్, ఏఎస్ఐ జీవన్, షాప్ యజమానులు పాల్గొన్నారు.

## దాబాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు

సోన్, మే 13: దాబా హోటల్లో ఎటువంటి అనుమతి, పర్మిషన్ లేకుండా మద్యం విక్రయించినా తాగేందుకు అనుమతిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ లింబాద్రి అన్నారు. మంగళవారం నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న ఎటువంటి అనుమతి, పర్మిషన్ లేకుండా మద్యం తాగడానికి అనుమతిస్తున్న దాబాలో తనిఖీ చేశారు. ఇక్కడ పోలీసు సిబ్బంది ఉన్నారు.

## లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

నిర్మల్ చైన్‌గేట్, మే 13 : మైనర్ బాలిక కిడ్నాప్, లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష పడినట్లు కోర్టు లైజన్ ఆఫీసర్ డల్లుసింగ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..ఆదిలాబాద్ జిల్లా ఖుర్షిద్‌నగర్ కు చెందిన షేక్ సమీర్ (20) 2019 సంవత్సరంలో దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌లో మైనర్ బాలికను కిడ్నాప్ చేసి హైదరాబాద్, జైనూర్ ఏరియాలకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంజీవ్ కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఉపేంద్రరెడ్డి విచారణ చేసి తుది నివేదికను కోర్టులో సమర్పించారు. మంగళవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్, సెషన్ జడ్జి ఎస్ శ్రీవాణి సాక్షులను విచారించి నేరస్థునికి పదేళ్ల కఠినగార శిక్షతో పాటు రూ. 3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

## వాగులో పడి యువకుడి మృతి

కుభీర్ః మే 13 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని నిగ్వ గ్రామానికి చెందిన గూండ్ల గంగాధర్(25) సోమవారం ఉదయం చేపలు పట్టేందుకు ఇంట్లో చెప్పి వెళ్లి నిగ్వ సమీపంలోని సుద్దవాగు బ్యాక్ వాటర్‌లో శవమై తేలాడని కుభీర్ ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఈ విషయాన్ని స్థానికులు ఒడ్డున ఉన్న బట్టలను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మంగళవారం ఈతగాళ్ల సాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. శవ పంచనామా అనంతరం భైంసా దవాఖానరు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు

ఎదులాపురం, మే 13: అనాథ శవానికి స్వచ్ఛంద సంస్థలు, పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. ఐదు రోజుల క్రితం ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్ చౌరస్తా సమీపంలో మృతి చెంది ఉన్నారు. మృతదేహాన్ని రిమ్స్‌లోని మార్చురిలో భద్రపరిచారు. ఎవరు రాకపోయేసరికి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చారు. తిర్పెల్లిలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియాల్లో మానవ సేవా మాధవ సేవా సొసైటీ అధ్యక్షుడు శ్రీపాదవార్ శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు నైతం సుఖ్‌లాల్, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, అమన్ ఫౌండేషన్ ఆదిలాబాద్ అధ్యక్షుడు అర్ఫాత్ ఖాన్, బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ సభ్యుడు ప్రమోద్ కుమార్ ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఎదులాపురం, మే 13 : ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద (టీ) బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పాత జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి రవి అనే హనుమాన్ దీక్షపరుడు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతుడు ఖుర్షిద్ నగర్ వాసిగా గుర్తించారు.

## సెల్‌ఫోన్ అప్పగించిన ఆర్టీసీ డ్రైవర్

నిర్మల్ చైన్‌గేట్, మే 13: బస్సులో సెల్‌ఫోన్ పోగుట్టుకున్న ప్రయాణికుడికి ఆర్టీసి డ్రైవర్ ఇచ్చి తన నిజాయితీని చాటుకున్నారు. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు వెళ్తుండగా సోమవారం వరంగల్‌లో ఓ ప్రయాణికుడు బస్సు ఎక్కి బస్సులో సెల్‌ఫోన్ మరిచి విజయవాడలో దిగిపోయాడు. డ్రైవర్ సుమన్ టిక్కెట్లు ఇవ్వడానికి బస్సులోపలికి వెళ్లగా సెల్‌ఫోన్ కనిపించింది. సదరు ప్రయాణికుడు సర్వీస్ నంబర్ ఆధారంగా డ్రైవర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. ఫోన్ తన దగ్గర ఉందని తెలిపాడు. తిరుగు ప్రయాణంలో విజయవాడలో విజిలెన్స్ సెక్యూరిటీ కానిస్టేబుల్ స్టేషన్ మేనేజర్ సమక్షంలో ప్రయాణికునికి సెల్‌ఫోన్ అందించి తన నిజాయితీ చాటుకున్నాడు.